వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 13 జూన్ 2023

## యువకుడు దారుణహత్య

కేవి.పల్లె, జూన్ 12

ప్రభాతవార్తః




హత్యకు గురైన గణేష్, గణేష్ (పాతచిత్రం)

మండలంలోని గాలివారిపల్లె పంచాయతీ బొప్ప సముద్రం గ్రామంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైయ్యాడు. కేవి.పల్లె ఎస్సై కథనం మేరకు వివరాలు బొప్ప సముద్రం గ్రామానికి చెందిన మద్దెల గణేష్(28) అదే గ్రామానికి చెందిన సాంబశివ అతని అనుచరులు కలిసి సోమవారం మధ్యాహ్నం గ్రామసమీపంలో కొడవళ్లతో తల, కాళ్లు, చేతులు నరికి అతనిని హత్యచేశారు. విషయం తెలుసుకున్న కేవి.పల్లె ఎస్సై లోకేష్, సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న సీఐ నాగేంద్ర, డీఎస్పీ మహబూబ్‌బాషాలు బొప్పసము ద్రం గ్రామానికి చేరుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## జగనన్నకు చెబుదాం అర్జీల పట్ల అలసత్వం వద్దు

### - జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్

రాయచోటి, జూన్ 12ప్రభాతవార్త:



ప్రజా సమస్యల సత్వర పరిష్కారార్థం జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్‌తో పాటు జెసి ఫర్మన్ అహ్మద్, డిఆర్వో సత్యనారాయణ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎమ్మెల్యే, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమ భూకబ్జాలలో

# బద్వేలు మొదటి స్థానం

### బద్వేలు ఎమ్మెల్యే భూమినే కబ్జా చేసిన ఘనులు - రూ.2 వేల కోట్ల ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కబ్జా

### టీడీపీ అధికారంలోకి రాగానే భూములన్నీ వెనక్కి - ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నాయకుల కబ్జాలు

### - టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్







బద్వేలు అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త :

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకుల కబ్జాల పర్వం కొనసాగుతూ రాయలసీమలోనే బద్వేలు కబ్జాలలో మొదటి స్థానంలో నిలిచి పేరుగాంచిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా 124వ రోజు సోమవారం బద్వేలులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్ రెడ్డి, కైవల్యా రెడ్డి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో వైకాపా నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాలకు పుట్టినిల్లుగా బద్వేలు మారిందని, బద్వేలు ఎమ్మెల్యే డా॥ సుధ భూమినే కబ్జా చేస్తే దిక్కుతోచక కలెక్టర్, ఆర్డీవోలను సంప్రదించిన పరిస్థితి దాపురించిందన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ఈ ప్రాంతంలో 2 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ భూములు కబ్జాకు గురైనట్లు స్పష్టంగా కనపడుతుందన్నారు. ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి కబ్జాలను ప్రోత్సహించడమే కాకుండా కేకుల్లా కట్ చేసి ప్రతి మండలానికి ఒక నాయకుడిని నియమించి కబ్జాలను ప్రోత్సహిస్తున్నట్లు కనపడుతుందన్నారు. వారి బంధువర్గానికి, నాయకులకు ప్రభుత్వ భూములు కబ్జా చేసేందుకు అవకాశం కల్పించారన్నారు. వైసీపీ నేతలైన రమణా రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, గురుమోహన్, పుత్తా శ్రీరాములు, పోలిరెడ్డి, యల్లారెడ్డి కలిసి రూ.200 కోట్లు విలువైన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్థులు కొల్లగొట్టారన్నారు. ఆర్డీవో ఆకుల వెంకటరమణ 40 మంది వైసీపీ కాలకేయులపై జాబితా సిద్ధం చేసి కేసులు పెట్టకుండా వైసీపీ నాయకులను తప్పించి అమాయకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారన్నారు. వైసీపీ నేత యోగానంద రెడ్డి, వెంకట రెడ్డి, పిచ్చిరెడ్డి, పోరుమామిళ్ళ-బద్వేలు రోడ్డు పక్కన ఉన్న రూ.150 కోట్లు విలువైన 200 ఎకరాలు ఆక్రమించారన్నారు. అలాగే పోరుమామిళ్ళ ఫుడ్ కమిటీ ఛైర్మెన్ అయిన ప్రతాప్ రెడ్డి రూ.300 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్మేశారని, యూట్యూబ్‌లో నీతిమంతునిలా బిల్డప్ ఇచ్చే బాబాయ్ ప్రతాప్ రెడ్డి అనుచరులు సర్వే నెంబర్ 289 లో 11 ఎకరాలు, 1094, 1076/1ఎ లో భూములను బినామీ పేర్లతో కాజేశారన్నారు. రంగసముద్రం రెవిన్యూ పొలంలో సర్వే నెంబర్ 1076/1ఎ లో 10.65 ఎకరాల మాదిగ ఇనాం భూములను ఆక్రమించడమే కాకుండా 1095 లో 20 ఎకరాలు, 1095/3 లో 3 ఎకరాలు నకిలీ పత్రాలతో ఆక్రమణ చేశారని, కలసపాడు వైసీపీ నేత గురివిరెడ్డి ఏకంగా ప్రభుత్వ హాస్పిటల్ భూమినే కాజేశారన్నారు. మరో 40 ఎకరాలు వారి కుటుంబ సభ్యుల పేర్లతో కాజేశారని, మరో వైసీపీ నేత పురుషోత్తం రెడ్డి పాత రామాపురం, శంఖవరం, మామిళ్ళపల్లి భూములతో పాటు 120 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించారని, బద్వేలు మున్సిపాలిటీలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరగాలన్నా ఛైర్మెన్ రాజగోపాల్ రెడ్డికి కాంట్రాక్టర్లు 23 శాతం రుసుము చెల్లించాల్సిందేనని, లేకుంటే పనులు నిలిపివేయడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారన్నారు. సోమశిల బ్యాక్ వాటర్, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగునీరు అందిస్తామని జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, అలాగే వెలుగోడు ప్రాజెక్టు ద్వారా పోరుమామిళ్ళ, కలసపాడు మండలాలకు సాగు, త్రాగునీరు అందిస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. అలాగే యువ నేత రితీష్ రెడ్డి కోరుకున్న విధానం ప్రకారం టీడీపీ అధికారంలో వచ్చిన వెంటనే ప్రభుత్వ భూములపై విచారణ జరిపించి కబ్జాకు గురైన భూములన్నింటిని వెనక్కి తీసుకోవడంతో పాటు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బద్వేలు పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తామని జగన్‌మోహన్ రెడ్డి ఉప ఎన్నికల కోసం హామీ ఇచ్చి బద్వేలు ప్రజలను నట్టేట ముంచారన్నారు. టీడీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందిపెడుతున్న వారు ఎవరినీ వదిలిపెట్టేది లేదని, వారు బద్వేలులో ఉన్నా, బంగ్లాదేశ్‌కు పారిపోయినా తగిన బుద్ధి చెబుతామన్నారు. బద్వేలులో జెండా ఎగురవేసి బద్వేలు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటామని, పెద్దాయన వీరారెడ్డి కలలు కన్న ప్రకారం ఈ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని, విజయమ్మ, రితీష్ రెడ్డిలు ఇచ్చిన మాట తమ మాటగా భావించి కష్టపడి పనిచేసి అభివృద్ధి వైపు అడుగులు వేస్తామని తెలిపారు. చంద్రబాబు నాయుడుది విజనరీ అని, జగన్‌ది ప్రిజనరీ అని, చంద్రబాబు అంటే బ్రాండ్ అని, జగన్ అంటే జైలు అని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, మాజీ మంత్రులు చంద్రమోహన్ రెడ్డి, అమరనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డి, కైవల్యా రెడ్డి, డా॥ ఓబుళాపురం రాజశేఖర్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దేవగుడి నారాయణ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, హరి ప్రసాద్, వెంగల్ రెడ్డి, కొంకుల రాంబాబు, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మహేష్ రెడ్డి, మహబూబ్ బాష (బిగ్‌బాస్), జహంగీర్, నాగిరెడ్డి జనార్ధన్ రెడ్డి, సోమేసుల పార్థసారధి, సమ్మెట అబ్రహాం, మిత్తికాయల రమణ, రాము తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## బంగారు, నగదు ఉన్న సూట్‌కేసుతో పరారైన ఆటో డ్రైవర్ అరెస్ట్

### - రూ.17.50లక్షలు విలువైన బంగారు, రూ.80వేలు నగదు స్వాధీనం

### - కడప డీఎస్పీ మహ్మద్ షరీఫ్



కడప క్రైం, జూన్ 12, ప్రభాతవార్త:

ఆటోలో ప్రయాణించి గమ్యస్థానం దిగిన ప్రయాణికులు తమ బ్యాగులను తీసుకోక ముందే బంగారం, నగదు ఉన్న సూట్‌కేసుతో సహా పరారైన ఆటో డ్రైవరును కడప వన్‌టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని శభాష్ అనిపించుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి బంగారు నగదు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఎస్సై మధుసూదన్‌రెడ్డితో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మహ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల మేరకు పోతుల ప్రమీల అనే మహిళకు చెందిన సూట్ కేసును దొంగలించిన కేసులో ఆటో డ్రైవరును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 17.50లక్షల రూపాయలు విలువైన 357 గ్రాముల బంగారు నగలు, రూ.80వేలు నగదు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కడప నగరం, ఎస్‌బీఐ కాలనీలో నివసించే మధుసూదన్‌రెడ్డి వృత్తి రీత్యా ఆటో డ్రైవరుగా ఉంటున్నట్లు తెలిపారు. జూన్ 11వ తేదీన కడప పోలీసు స్టేషన్‌కు పోతుల ప్రమీల అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన కుటుంబ సభ్యులతో గృహ ప్రవేశానికి తిరుపతికి వెళ్లి తిరిగి కడపకు వచ్చి కడప రైల్వే స్టేషన్‌లో ఆటో ఎక్కినట్లు తెలిపారు. ఏపీ 39 ఎక్స్ 4692 నెంబరు గల ఆటో ఎక్కి తిరుమల అపార్ట్‌మెంట్ వద్దకు వెళ్లి ఆటో దిగి సామాన్లను తీసుకునే సమయంలో సూట్ కేసుతో ఆటోతో డ్రైవర్ పారిపోయినట్లు తెలిపారు. సూట్ కేసులో నగదు, బంగారును ఉన్నట్లు ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. కడప డీఎస్పీ పర్యవేక్షణలో కడప వన్‌టౌన్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై మధుసూదన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి ఒక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో సీసీ కెమెరాలు పర్యవేక్షించి దొంగలించిన ఆటో డ్రైవరును ఎట్టకేలకు చాకచక్యంగా పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడిని ఫాతిమా కాలేజీ వై.జంక్షన్ వద్ద ఆటోతో సహా పట్టుకొని అతని వద్ద నఉంచి రూ.17.50లక్షల విలువైన బంగారు, రూ.80వేలు నగదు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిఎపారు. కేసు నమోదు చేసి 24 గంటల్లో ఆటో డ్రైవర్‌ను పట్టుకొని బాధితులకు న్యాయం చేయడంలో కృషి చేసిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

## కీర్తి వైద్యానికి ఎంపీ మిథున్‌రెడ్డి అభయం

### - బెంగళూరు అపోలో ఆసుపత్రికి తరలింపు - సోషల్ మీడియా ఆపన్న హస్తం..

### - కువైట్ నుంచి కీర్తి తల్లి అరుణ రాక..

బి.కొత్తకోట, జూన్ 12, ప్రభాతవార్త:



బి.కొత్తకోట మండలం బీరంగికి చెందిన కీర్తి లివర్ సమస్యతో ప్రాణాపాయం స్థితిలో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్న కథనాన్ని ఈనెల 6న వార్త దినపత్రికలో పథాక శీర్షికన ప్రచురితమైన విషయం పాఠకులకు తెలిసిందే. కీర్తి మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వార్తపై స్పందించిన ఎంపీ మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు బాలికకు మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన బెంగళూరు అపోలో ఆసుపత్రికి సోమవారం తరలించారు. అపోలో ఆసుపత్రిలో అడ్వాన్స్‌గా ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతినిధులు కీర్తి వైద్యానికి రూ.లక్ష డిపాజిట్ చేసి మెరుగైన వైద్యానికి పూర్తి సహకారం అందించారు. దీనికి తోడు సోషల్ మీడియా ప్రతినిధులు మానవతా దృక్పథంతో కీర్తిని ఆదుకోవడానికి తమ వంతు సహకారానికి ముందు ఉంటామని తెలపడంతో పాటు తమ స్నేహితులు, శ్రేయోభిలాషులకు కీర్తి వైద్యానికి తమ వంతు సాయంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని వైసీపీ సోషల్ మీడియా ద్వారా తెలియజేయడం హర్షాతిరేకం. అదే విధంగా తాను చదువుకున్న కురబలకోట కస్తూర్బా పాఠశాల విద్యార్థులు కీర్తి అనారోగ్య పరిస్థితిని గమనించి తమతో చదువోపాటు ఆడుతూ పాడుతూ మన మధ్య తిరిగిన కీర్తిని ఆదుకోవడానికి ఆ చిన్నారులు చిట్టి చేతులతో సుమారు రూ.40వేలకు పైగా ఆర్థిక సాయం అందించడం చిరుప్రాయంలోనే మానవత్వానికి నిలువుటద్దంలా అందరికీ ఆదర్శంగా నిలిచారు. కీర్తి తల్లి కువైట్ నుంచి తిరిగి వస్తున్నట్లు ఫోన్ ద్వారా సమాచారం అందింది. కీర్తిని బబెంగళూరు అపోలో ఆసుపత్రిలో చేర్పించిన ఎంపీ మిథున్‌రెడ్డి రూ.లక్ష డిపాజిట్ చెల్లించడమే కాక యుద్ధ ప్రాతిపదికన సీఎం సహాయ నిధి నుంచి అందేలా చర్యలు చేపడతామన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న కీర్తి దాతల సాయంతో మెరుగైన వైద్యం పొంది ఆరోగ్యంగా తిరిగి రావాలని సర్వత్రా కోరుకుంటున్నారు.

## తిరుపతి రోడ్డులో నూనెవిత్తుల కర్మాగారం భూకబ్జాలపై సెల్ఫీ తీసుకున్న తెదేపా జాతీయ నేత : నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జూన్ 12 ప్రభాతవార్తః



పీలేరు పట్టణంలో భూ ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తిరుపతి రోడ్డులోని నూనెవిత్తుల కర్మాగారం భూమి ఆక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ తెదేపా శ్రేణులతో అక్రమాలపై ఆరా తీశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు శ్రేణులు పెద్ద ఎత్తున తిరుపతి రోడ్డు మార్గంలోని నూనెవిత్తుల కర్మాగారం దగ్గరికి చేరారు. తెదేపా స్థాపకులు దివంగత మాజీ సీఎం నందమూరి తారకరామారావు రాయలసీమ రైతుల్ని ఉద్దేశించి పీలేరు తిరుపతి రోడ్డు మార్గంలో గూడరేవుపల్లె పరిధిలో సర్వే నెంబరు 198,199లో 50 ఎకరాలకు పైగా భూమి పట్టణంలోని కొంతమంది స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇవ్వడం జరిగిందన్నారు. నేడు వైకాపాకు చెందిన బడాబడా నాయకులు ప్రహరీగోడ పగులకొట్టి భూ ఆక్రమణలకు పాల్పడి అంతస్తులపై అంతస్తులు కడుతున్నారని అన్నారు. పక్క మండలానికి చెందిన వారికి ఇక్కడ స్థానికంగా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు లేకుంటే ఇంటి స్థలానికి ఎలా అర్హులౌతారో చెప్పాలని డిమాండుచేశారు. మంత్రులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించింది భూ ఆక్ర మాలకు పాల్పడి భూములు అమ్ముకోవడానికి కాదని ప్రభుత్వ భూములు పరిరక్షించుకోవడానికి అన్నారు. ఒక్కో ఇంటి స్థలం రూ.5 నుంచి రూ.15లక్షలు వరకు అమ్మి సొమ్ముచేసుకుంటున్నారన్నారు. గతంలో భూ అక్రమాలపై కమిటీలు వేసి సర్వేలు చేసి అక్రమాలకు గురైనట్లు అప్పటి సబ్ కలెక్టర్ నివేదిక అందజేసిన చర్యలు మాత్రం శూన్యం, మంత్రులు, ఎమ్మెల్యేలు అప్పటి సబ్ కలెక్టర్‌ను బదిలీచేయించారన్నారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేశామని భూ ఆక్రమణలు నిజమేనని తేల్చారు. ఆనాడు భూములిచ్చిన వారు నేడు బ్రతుకు దెరువు లేక ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఎవరైతే ఆనాడు భూములు ఇచ్చారో ఆభూములు వారికే ఇవ్వాలని డిమాండుచేశారు. భూఆక్రమణలకు పాల్పడుతున్న వారి ఆటలు ఎన్నో రోజులు సాగవని ఆయన హెచ్చరించారు. ఇదే విధంగా ప్రభుత్వ భూ ఆక్రమాలు కొనసాగితే వేల మందితో రెవెన్యూ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తామని అన్నారు.

నాడు నేడుతో

ప్రభుత్వ పాఠశాలల

రూపురేఖలే

మారాయి

ఎపిఆర్‌డిసి డైరెక్టర్

గుల్జార్‌బాషా

వార్త IVవ పేజీలో

## ఎంకే హార్డ్ వేర్ షాపులో అగ్నిప్రమాదం- భారీ నష్టం

వాల్మీకిపురం, జూన్ 12 ప్రభాతవార్తః

స్థానిక తరిగొండ రోడ్డులోని ఎంకే హార్డు వేర్ షాపులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి భారీ నష్టం వాటిల్లింది. గుర్రంకొండ మండలం మర్రిపాడుకు చెందిన ఉమర్ వాల్మీకిపురంలోని తరిగొండ రోడ్డులో సొంత దుకాణం నిర్మించుకుని హార్డువేర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణంలో పెయింట్స్, ప్లాస్టిక్ కెమికల్సుకు సంబంధించి వస్తువులు ఉండడంతో పాటు దుకాణానికి సంబంధించిన గోదాము సైతం ఫ్లోర్‌లో ఉండడం, అందులోని ఎలక్ట్రికల్ వస్తువులు,, పెయింట్స్ ఉండటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రెండు ఫ్లోర్లలో వస్తువులు అంటుకుని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సకాలంలో సంఘటనా స్థలానికి అగ్నిమాపక వాహనం వచ్చినా మంటలు అదుపుచేయలేక సిబ్బంది నానా అవస్థల పడ్డారు. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో భవనం మొత్తం కాలిపోవడంతో పాటు పొగదాటికి మరో రెండు భవనాలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో ఎంకే హార్డువేర్‌కు దాదాపు రూ.30లక్షలు నష్టం వాటిల్లిందని బాధితులు అంటున్నారు. అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నం చేసి పంచాయతీ వాటర్ ట్యాంకర్లు, స్థానిక యువకుల సహాయంతో మంటలను అదుపుచేశారు. పోలీసులు సంఘటనకు దారి తీసిన అంశాలపై ఆరా తీస్తున్నారు.



అగ్నిప్రమాదం సంభవించిన షాపు

# ఆదర్శ పాఠశాలగా తల్లెంవారిపల్లెను తీర్చిదిద్దుతాం

**- రూ.10కోట్లతో మౌలిక వసతులతో అటవీ శివారు గ్రామం అభివృద్ధి**

**- ఆదర్శ ప్రాయుడు సీఎం సలహాదారుడు రాకాశీ ధనుంజయరెడ్డి**

**- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కొరముట్ల**



ఓబులవారిపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలంలోని గాదెల పంచాయతీలో ఉన్న తల్లెంవారిపల్లె గ్రామంలో సోమవారం సీఎం సలహాదారుడు రాష్ట్ర ప్రచార ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజానికి ఆదర్శ ప్రాయుడు సీఎం సలహాదారుడు ధనుంజయరెడ్డి అని ఆయన పేర్కొన్నారు. అన్ని విధాలా చిన్నతనం నుంచి ఇబ్బందులు పడిన కష్టాలను గుర్తుంచుకొని కన్నతల్లి లాంటి గ్రామాన్ని ఆధ్యాత్మికంగా వైద్య పరంగా విద్య పరంగానూ చీకటిలో ఉన్న గ్రామాన్ని వెలుగు నింపి నియోజకవర్గ అభివృద్ధి కూడా సహాయ సకారాలు అందిస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అనంతరం సీఎం సలహాదారుడు దనుంజయరెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి నేను పడ్డ కష్టాలను గుర్తు పెట్టుకొని ఓబులవారిపల్లికి, తల్లెంవారిపల్లెకు కాలినడకతో వెళ్లి విద్యాభ్యాసం నేర్చుకున్నాని నాలాగే గాదెల జీవీపురం, నూకనపల్లి, తల్లెంవారిపల్లె తదితర గ్రామాల నుంచి వందల సంఖ్యలో పాఠశాలకు వెళ్లి విద్యను అభ్యసించే వారమని అందువల్ల విద్యార్థులకు అందుబాటులో ఉండి బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రాంతంలోనే విద్యుత్తు సబ్‌స్టేషన్, ఆసుపత్రి, గ్రంథాలయం, దేవాలయం, పాఠశాలను ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ మండలి కమిటీ సభ్యులు పంజాబ్ సుకుమార్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు సాయి కిశోర్‌రెడ్డి, కొల్లం గంగిరెడ్డి, పీడీ నాగేంద్ర ధ్వజారెడ్డి, సుధాకర్‌రాజు, కొమ్మూరు భాస్కర్‌రెడ్డి, కొమ్మూను నారాయణరెడ్డి, కొమ్మూరు శంకర్‌రెడ్డి, నూక జైపాల్‌రెడ్డి, రమేష్ నాయుడు, సుకుమార్, కృష్ణయ్య, కొత్త నరసింహులు, అరవ సుధీర్‌రెడ్డి, చిన్‌రెడ్డి, గురువురెడ్డి, చిన్‌రెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, అధికారులు ఎంఈవో పద్మ, ఎండీవో విజయారావు, డిప్యూటీ తహసీల్దార్ పీర్‌మున్నీ, ఉపాధ్యాయులు గడ్డం ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, సుబ్బరాయుడు, రవి, పంచాయతీ కార్యాలయ, సిబ్బంది, కార్యదర్శులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిలువునా మోసం

**- టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జింకా శ్రీనివాసులు**

కడప వైద్యవిభాగం, జూన్ 12, ప్రభాతవార్త:



కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీఎం జగన్ నిలువునా మోసం చేస్తున్నారని తెదేపా తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు జింకా శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్నప్పుడు ఆయన ఇచ్చిన వాగ్దాన ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తప్పనిసరిగా రెగ్యులర్ చేస్తామని అదే విధంగా టైం స్కేలు ఇస్తామని జగన్ మోసపూరిత మాటలు చెప్పి ఉదోయయగులందరి ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చాడని తెలిపారు. అయితే ఇపుడు అదే జగన్ గ్రామంలో ఉన్న 1.35లక్షల పైచిలుకు ఉద్యోగస్తులలో కేవలం 10117 మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని చెప్పడం చాలా దురదృష్టకరమన్నారు. చాలీ చాలని జీతాలతో కుటుంబం జరగక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉందని రెగ్యులర్ అవుతామని ఎన్నో ఆశలు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని అందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొమ్మలపాటి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

లక్కిరెడ్డిపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక విశ్వ భారతి హైస్కూల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకై ప్రభుత్వం కొత్త చట్టం తెచ్చిందని ఆమె తెలియజేశారు. బాలికలకు వివాహాలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే 1098 నెంబర్‌కు సమాచారం తెలపాలన్నారు. అలాగే ప్రతి పిల్లవాడు 100/223 నెంబర్లకు పోలీసులకు ఫోన్ చేయాలన్నారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుంటారని తెలిపారు. ప్రతి పిల్లవాడు బడిలోనే ఉండాలని పిల్లలను బడికి పంపకుండా పనులకు పంపిస్తే చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ డ్రాపౌట్స్ కాకుండా బడిలో ఉండాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దాద్వి అరుణ్‌కుమారి, అరుణాదేవి, వర్కర్లు పాల్గొన్నారు.

# జగనన్న విద్యా కానుక పంపిణీ

లక్కిరెడ్డిపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:



2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన జగనన్న విద్యా కానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు జగనన్న కిట్లను ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని ప్రతి వస్తువు నాణ్యతతో కూడినదని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అమీర్, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, వెంకట నారాయణరెడ్డి ఎంపీటీసీ, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ

కడప లీగల్, జూన్ 12, ప్రభాతవార్త:

ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జీ, ఫుల్ అడిషనల్ ఛార్జ్ సెక్రటరీ ఎం.ప్రదీప్ కుమార్ ఏర్పాటు చేసిన ర్యాలీని లేబర్ డిపార్ట్‌మెంట్, చైల్డ్ డిపార్ట్‌మెంట్ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నగరం శిశు సంరక్షక కార్యాలయం నుంచి కోటిరెడ్డి సర్కిల్ వరకు జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం ప్రాథమికను తెలిపారు. పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు మునిస్వామి, జాన్సన్, శ్రీనివాసులురెడ్డి, డిస్టిక్ ప్రొహిబిషన్ ఆఫీసర్ చెన్నారెడ్డి, ఎల్‌పీఓ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

# బయటపడ్డ వర్గ విభేధాలు

పెండ్లిమర్రి, జూన్ 12, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం వెల్లటూరు ఎంపీటీసీ నాగ మల్లారెడ్డి వర్గీయులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గడప గడపకు కార్యక్రమం నిర్వహించినా దుమ్మాకొట్టారు. తమకు సరైన ప్రాధాన్యత కల్పించలేదంటూ హాజరు కాని ఎంపీటీసీ మరియు ఆయన వర్గీయులని ప్రచారం జరుగుతోంది. గతంలో కూడా ప్రాధాన్యత కల్పించలేదంటూ పెండ్లిమర్రి మండలానికి సంబంధించిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన సమావేశానికి దుమ్మా కొట్టడంతో తేటతెల్లమైంది. మండలంలోని మండలాధ్యక్షుడి వర్గీయులకు ప్రాధాన్యత ఎక్కువగా ఇస్తున్నారని వెల్లటూరులో ఉన్న ఎంపీటీసీ, సంగటిపల్లె సర్పంచ్‌కు సరిగా ప్రాధాన్యత ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు.

# సమస్యల పరిష్కారమే స్పందన ప్రధాన లక్ష్యం

**తాహాశీల్దారు దామోదర్‌రెడ్డి**

గోపవరం, జూన్ 12 ప్రభాతవార్త;



సమస్యల పరిష్కారమే స్పందన ప్రధాన లక్ష్యం అని తాహశీల్దారు దామేదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచాయిపేట సచివాలయంలో సోమవారం స్పందనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ యా శాఖల అధికారుల పనితీరు పట్లా హర్షాన్ని వ్యక్తం చేసారు. ప్రధానంగా ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలన్నారు. అంతే కాకుండా అధికారులు సహకరించినపుడే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఎంఎస్‌ఓ నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎంపిడిఓ హరినారాయణ కార్యక్రమంలో పలు అంశాలను వివరించారు. ప్రజలనుంచి పలు రకాలైన సమస్యలతో కూడిన వినతి పత్రాలను స్వీకరించారు. ఏఓ అరవింద నాయక్ మట్లాడుతూ వ్యవసాయ రంగంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకు రైతులు ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. మండల ఆర్ఐ అమర్‌నాద్‌రెడ్డిమాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. మండల హెల్త్ ఆఫిసర్ శివరామిరెడ్డి పలు ఆరోగ్య విషయాలను ప్రజలకు వివరించారు. విద్యుత్ శాఖాదికారి చిన్నయ్య, పిఆర్ఏఈ చిట్టిబాబు, కార్యదరి నిఖిత, ఏపిఎం శివప్రసాద్, ఎపిఓ, విజయమ్మ, ఆర్‌డబ్లి ఏఈ రవితేజ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీలు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించింది వైసిసి ప్రభుత్వమే

**ఎమ్మెల్యే రఘురామిరెడ్డి**



మైదుకూరు, జూన్ 10 ప్రభాతవార్త :

మైదుకూరు నియోజకవర్గ ప్రజలు సుభిక్షముగాను, సంతోషంగా ఉన్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి అన్నారు. సోమవారం మైదుకూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పసుపు కొనుగోళ్లలో మైదుకూరు ముందు ఉందన్నారు. మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కలిసి మొత్తం 13వందల మంది రైతులు దాదాపు 2,200 క్వింటాళ్ల పసుపు పండించారని అన్నారు. మైదుకూరు నియోజక వర్గంలో రూరల్ మార్కెట్లో ధరలేకున్న రైతులు పండించిన పంటకు అధిక ధర పెట్టి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో వేసిన పంట మొత్తంలో 50 శాతం ఒక మైదుకూరు నియోజకవర్గంలో పసుపు పంట పండించడం జరిగిందన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం డిసెంబర్ నెలలో పండించిన పంటకు కూడా అధిక ధర హెచ్చించడం జరిగిందని అన్నారు. ఎనిమిది వరి దాన్యం బస్తాలు అంటే 624 కేజీలు సుమారు రూ.18 వేల అమ్ముడుపోతున్నాయంటే సంతోషించాల్సిన విషయమేనన్నారు. 20 - 21 సంవత్సరంలో రూ. 4వేల ఉన్న పసుపు రూ.6 వేల పెట్టి కొనడం జరిగిందన్నారు. మైదుకూరు మండలంలో 563 మంది రైతులు పసుపు పంట పండించారని అలాగే దువ్వూరు మండలంలో 258 మంది రైతులు, చాపాడు మండలంలో 250 మంది రైతులు, కాజీపేటలో 195 మంది రైతులు మరియు బి.మఠం అంతా కలిసి 13వందల మంది రైతులు కలసి దాదాపు 2,200 మెట్రిక్ టన్నుల పసుపు దిగుబడి వచ్చిందన్నారు.

# ఈనెల 22న యువ ఉత్సవ్‌లో పాల్గొనండి..

కడప వైద్యవిభాగం, జూన్ 12, ప్రభాతవార్త:

యువత జిల్లా స్థాయి యువ ఉత్సవాలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) ప్రొద్దుటూరు కాలేజీ నందు జరుగుతుందని ఆ యువ ఉత్సవ్‌లో పంచ్ ప్రాణ్ ఆఫ్ అమ్రిత్ కాల్ అనే అంశంపై పెయింటింగ్, కవితవ్యం, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లమసీన్ విభాగాలలో వ్యక్తిగత పోటీలు మరియు కల్చరల్ (గ్రూప్) పోటీలు ఉంటాయని, కావునా జిల్లాలోని యువత ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని అలాగే యువ ఉత్సవ్‌లో వీరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# జగనన్న విద్యాకానుక సాహసోపేత నిర్ణయం

**ఎంపిపి లక్ష్మయ్య**

చాపాడు, జూన్12, ప్రభాతవార్త:



విద్యాభివృద్ధి కోసం జగనన్న ప్రభుత్వం చేపడుతున్న జగనన్న విద్యా కానుక సాహసోపేత నిర్ణయం అనిఎంపీపీ లక్ష్మయ్య కొనియాడారు . స్థానిక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు సర్పంచ్ అధ్యక్షతన విద్యా కానుక. జెవికె. కిట్లను అందజేశారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి మంచి కార్యక్రమం దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టడం లేదని మన రాష్ట్రంలో చేపట్టడం హర్షించ తగిన విషయమన్నారు. దీంతో విద్యార్థుల పట్ల ముఖ్యమంత్రి కి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుంద న్నారు. విద్యార్థులు కష్ట పడి తాము చదువుకున్న పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కొనియాడారు . ఈ కార్యక్రమంలో జడ్పిటిసి జేస్తాది రాణి.మండల విద్యా శాఖ అధికారి రవిశంకర్. తహసీల్దారు సుభాని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్ మోదిన్. పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు .

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం

కమలాపురం, జూన్ 12, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలో కార్మిక శాఖ మరియు ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పలువురు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అనే విధంగా ప్రతి తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై బాధ్యత ఎంతైనా ఉందన్నారు. చదువుకునే వయసులో 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలను ఎవరిని కూడా వెట్టి చాకిరి చేయించడం కానీ వివిధ కూలీ పనులకు పంపించడం నిషేధమన్నారు. ఎవరైనా అలా చట్టాన్ని అధిగమించి బాలలతో వెట్టి చాకిరి చేయిస్తే శిక్ష విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంఓ కార్మిక శాఖ అధికారి ప్రసాద్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసిన మండల స్పెషల్ అధికారి

కమలాపురం, జూన్ 12, ప్రభాతవార్త:



కమలాపురం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, తహసీల్దార్ అలీ ఖాన్, ఎంపీడీవో శేషాచలపతి కమిషనర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థులకు జగనన్న 4వ విడత కిట్లను అందించారు.

# శివోహం ఆధ్వర్యంలో అన్నదానం

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త :



శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అగస్త్యేశ్వర స్వామి దేవాలయం నందు అన్నదానం నిర్వహించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని మాధవ్ రెసిడెన్సీ అధినేత గంగిరెడ్డి మాధవ రెడ్డి, జయలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు 500 మందికి అన్నదానం నిర్వహించామని శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అన్నదానం పుణ్యకార్యమని, దాతల సహకారంతో శివోహం కమిటీ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం శివానుగ్రహంతో కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యాశాఖపై ఈ సారైనా పెడతార..!

ఖాజీపేట, జూన్ 12 ప్రభాతవార్త :



ఖాజీపేట మండలంలో విద్యాశాఖలో నిర్లక్ష్యపునీడలు ఏ రీతిన అలుముకున్నాయనెందుకు తార్కాణం గత 2022 -23 విద్యా సంవత్సరంలో సాధించిన ఫలితాలు మొత్తం మండలంలో 7 ప్రభుత్వ పాఠశాలల్లో 336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయితే 146 మంది ఉతీర్ణులయి మిగతా 190 మంది ఫెయిల్ అయ్యారు. కొత్తపేట ఉన్నత పాఠశాలలో మరీ దారుణంగా 29 మందికి కేవలం 3 విద్యార్థులు ఉతీర్ణులయ్యారు . సకల సౌకర్యాలు కల్పించి చక్కటి హాస్టల్ వసతి కల్పించిన సుంకేసుల కస్తూరిబా పాఠశాలలో ఉపాధ్యాయునిల నిర్లక్ష్యం కారణంగా 30 మందికి కేవలం 8 మంది ఉతీర్ణులయి మిగతా వారు ఫెయిల్ అయ్యారు. ఇంతటి దయనీయమైన ఫలితాలతో ఖాజీపేట మండలం జిల్లాలోనే అధమ స్థానంలో ఉంది. విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెచ్చి నాణ్యమైన విద్యని అందించాలని జగనన్న అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సత్ఫలితాలు ఇవ్వటం లేదన్నది బహిరంగ రహస్యం. ఈ విద్యా సంవత్సరం అయినా గతంలో మాదిరిగా కాకుండా ముందస్తు ప్రణాళికలతో విద్యా బోధనలు కావించి ఉతీర్ణతాశాతం పెంచాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన 8 ప్రయివేటు పాఠశాలలున్నాయి అందులో ఏ ఒక్కటో రెండో పాఠశాలలకి తప్ప మిగతావాటికి సరైన వసతులు, సరైన ప్రమాణాలు లేకపోయినా ఉన్నతాధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. సరైన ఫిట్ నెస్ కలిగిన వాహనాలు కలిగి వున్నాయా, సరైన అగ్నిమాపక సంరక్షక పరికరాలు కానీ దానికి సంబంధించిన సర్టిఫికెట్లు కానీ వున్నయా అని ఏనాడూ విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసిన పాపాన పోలేదు, ఇరుకిరుకు గదులలో వెంటిలేషన్, గాలి ఆడని గదులలో పాఠశాలలని నిర్వహించినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఒక ప్రయివేటు పాఠశాలలో జరిగిన అగ్ని ప్రమాదంలో అదృష్టవశాత్తు ఎలాంటి నష్టం జరగలేదు ఇక మీదట అయినా ఉన్నతాధికారులు పాఠశాలల ప్రారంభానికి ముందే ఒకసారి తనిఖీలు నిర్వహిస్తే బాగుంటుంది అని తల్లిదండ్రులు భావిస్తున్నారు.

# ముస్లీంలకు దత్తపుత్రుడుగా ఉంటాను - ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం, జూన్12, ప్రభాతవార్త



ముస్లీంలు అంటే నాకు ఎంతో ప్రేమని వారికి ఎదురైయ్యే కష్టాలలో అండగాఉండటంతోపాటు, వారిసమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించి ముందుకు నడిపిస్తూ అన్ని విషయాలలో తోడుగా ఉంటూ వారికి దత్తపుత్రుడుగా మిగిలిపోవాలని నాకోరిక అంటూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో సోమవారం నూతన మసీదు నిర్మాణానికి ఎర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు పాల్గొని కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు నిర్మాణంనకు రూ.36లక్షలు ఎమ్మెల్యే నిధులతో మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇక్కడ ఎన్నో మార్లు పలుసందర్భాలలో మస్లీంలతో కలిసి ప్రార్థన చేశానని అప్పుడు కొత్త మసీదు నిర్మాణంనకు సహకరించాలని పెద్దలుకొరగా అప్పుడే మాట ఇచ్చానని, ఆమాటకు కట్టుబడి నేడు మంజూరు చేయించానని తెలిపారు. మండల ఉపాధ్యక్షులు వెలవలి నారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో అనేక ప్రార్థనా మందిరాల అభివృద్ధికి, నిర్మాణాలకు ఎమ్మెల్యే రాచమల్లు కృషి అభినందనీయమన్నారు. మాజీ మార్కెట్‌యార్డు వైస్ చేర్మెన్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మసీదు నిర్మాణంనకు నిధులు మంజూరు చేసిన ఎమెమ్మెల్యే రాచమల్లుకు ముస్లీంల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు అబ్దుల్‌ఖాధర్, యంపిడిఓ సయ్యదున్నీషా, డి.ఇ మల్లేశ్వరరెడ్డి, రాజారామ్మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, శివనాగిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, వెంకటరెడ్డి, బలరామిరెడ్డి, వెలవలి శేఖర్‌రెడ్డి, ముస్లీం మతపెద్దలు పాల్గొన్నారు.

# జగనన్న విద్యకానుక కిట్లును పంఫిణి చేసిన ఎంపిపి జనార్ధన్‌రెడ్డి

ఒంటిమిట్ట, జూన్12, ప్రభాతవార్త:



ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలలో ఎంపిపి గడ్డం జనార్దన్‌రెడ్డి విద్యార్ధులకు జగనన్న విద్యకానుక కిట్లును పంఫిణి చేశారు. సోమవారం ఉదయం ఒంటిమిట్టలోని ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యకానుక కిట్లు పంఫిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఆతిదిగా ఎంపిపి జనార్ధన్‌రెడ్డి విచ్చేశారు. ఈసందర్బంగా ఆయన ప్రసంగించారు. అనంతరం విద్యార్దులకు జగనన్న విద్యకానుక కిట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్‌సురేష్‌కుమార్, తహసిల్దార్ మాదవిలత, ఎంపిడిఓ రెడ్డెయ్య, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, సర్పంచ్ కత్తి సుజాత, విద్యాకమిటి చైర్మన్ షేక్ ఆజంతుల్లా, నరవకాట్‌పల్లి సర్పంచ్ వెంకటరెడ్డి, ప్రదానోపాద్యాయురాలువెంకటలక్షుమ్మ. ఉపాద్యాయులు దాదిఆంజనేయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ అవగాహన ర్యాలీ

మైదుకూరు, జూన్ 12 ప్రభాతవార్త :



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవంలో భాగంగా సోమవారం మైదుకూరు ఎంపీడీఓ కార్యాలయం నుండి మునిసిపల్ కార్యాలయం వరకు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల కార్మిక నిర్మూలన కొరకు అందరితో సీడీపీఓ ప్రతిజ్ఞ చేయించారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, పిల్లలను చదివించాలని నినాదాలు చేశారు. అనంతరం సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. బాలలందరిని బడికి పంపించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుదామన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు, అన్ని శాఖల అధికారులు ఈ వ్యవస్థను నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ కొనసాగడం వల్ల సమాజంలో అనిశ్చిత పరిస్థితులు పెరుగుతాయన్నారు. అందరూ తమ పిల్లలను చదివించాలన్నారు. తమ పరిధిలో ఎక్కడైనా బాలకార్మిక వ్యవస్థ ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలనికోరారు, బాల కార్మికులను ఎవరైనా పనిలో పెట్టుకుంటే అట్టి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, డిసిపియు సిబ్బంది, బి.లక్ష్మి ప్రసన్న, మహిళా పోలీస్ లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, జూన్ 12, ప్రభాతవార్త:

కడప నగరం రామరాజుపల్లిలో ఓ వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తాలూకా సీఐ కలసయ్య తెలిపారు. సీఐ వివరాల మేరకు రామరాజుపల్లికి చెందిన వరప్రకాష్‌రావు(45) అప్పులు ఎక్కువ చేయడంతో పాటు ఈఎంఐలు చెల్లించలేక మానసికంగా బాధపడుతుండేవాడని సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి భార్య సబితా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

# నూతన ఎంపిడిఓగా శివరామిరెడ్డి

చిట్వేలి, జూన్ 12 ప్రభాతవార్త



చిట్వేలి మండల నూతన ఎంపిడిఓగా ఎన్.శివరామిరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఖాజీపేట నందు ఎఓగా ఉన్న తాను పదోన్నతిపై చిట్వేలి ఎంపిడిఓగా చేరారు. కాగా ఎఓగా ఉండి ఎంపిడిఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న మోహన్ తన పూర్వపు ఎఓ స్థానంలో చిట్వేలిలో కొనసాగనున్నారు.

# శ్రమకు ప్రత్యామ్నాయం లేదు

**వైవీయూ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్**

కడప, వైవీయూ, జూన్ 12 ప్రభాతవార్త :



క్రమశిక్షణ, సమయపాలన, వృత్తిపట్ల నిబద్ధతతో శ్రమిస్తూ ప్రతిభావంతమైన అధ్యాపకులుగా తయారవ్వాలి తద్వారా విశ్వ విద్యాలయం అకడమిక్ గా ప్రగతిపథంలో పయనిస్తుందని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్లతో సోమవారం ఆయన సైన్సు బ్లాక్లోని 180 సెమినార్ హాల్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అకడమిక్ కన్సల్టెంట్ల పరిచయం అనంతరం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ చింతా సుధాకర్ మాట్లాడారు. విశ్వవిద్యాలయం అకడమిక్ గా పరిపుష్టిని సాధించడంలో మీ పాత్ర కీలకం మరింత శ్రమించండి.. శ్రమకు ప్రత్యామ్నాయం లేదని మార్గనిర్దేశం చేశారు. బోధన పరిశోధనలో నైతిక విలువలు పాటించాలన్నారు. విశ్వవిద్యాలయ కీర్తిని తగ్గించే ప్రయత్నం చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తోడ్పాటును అందిచడం అంటే సమర్థవం తమైన అధ్యాపకులుగా మీరు తయారవుతున్నారని గుర్తుంచుకోవాలన్నారు. విధులపట్ల ఎంత కచ్చితంగా ఉంటానో అలానే పరిపాలనపరంగా మీకు అందాల్సిన ప్రయోజనాలు అందించడానికి ఎల్లప్పుడూ తాను సిద్దంగా ఉంటానన్నారు.

# అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన

**- ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు**

తంబళ్లపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె శ్రీపీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం జరిగిన అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ఉదయం ప్రిన్సిపల్ శేషారెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన అప్రెంటీస్ మేళాలో పలు ప్రముఖ పారిశ్రామిక కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మేళాకు మొత్తం 70 మంది నిరుద్యోగులు పాల్గొనగా అందులో 42 మంది పలు కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేసుకున్నారు. ఈ ఎంపికలో ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ శ్రీకాళహస్తి కంపెనీ 22 మంది, బెంగళూరు ఎల్అండ్‌టీ లిమిటెడ్ కంపెనీకి 20 మంది నిరుద్యోగులను కంపెనీల ప్రతినిదులు ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజు మాట్లాడుతూ ఎంపికైన నిరుద్యోగులు అప్రెంటీస్ విదానంలో ఉపాధి పొంది తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకొని ఆర్థికంగా స్థిరపడి అభివృద్ధిలోకి రావాలని హితవు పలికారు. అప్రెంటీస్ మేళా ద్వారా నిరుద్యోగుల ఎంపిక చేపట్టిన పలు కంపెనీల ప్రతినిదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అప్రెంటీస్ మేళాలో ఐటీఐ అధ్యాపకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఓ వరం..

**- నారాయణరెడ్డి**

తంబళ్లపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:



ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఓ వరం లాంటిదని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కొనియాడారు. సోమవారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక విద్యార్థులకు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి జగన్ ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యా కానుక అందజేయడం హర్షనీయమన్నారు. ప్రతి విద్యార్థి కార్పొరేట్ స్థాయి విద్య కోసం సీఎం అపార నిధులు మంజూరు చేసి విద్యాదాతగా మారాడన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ, క్రీడల్లో ఉన్నత స్థాయిలో రాణించి పాఠశాలకు తద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యాకానుక కిట్లను విద్యార్థులకు నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో త్యాగరాజు, కోటిరెడ్డి స్కూలు కమిటీ చైర్మన్ సలీం, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సరోజమ్మ, కరీం, ఆనంద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసి చైర్మన్‌కు ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం

ఖాజీపేట, జూన్ 12 ప్రభాతవార్త :



రాత్రి సమయంలో ఖాజీపేట మండల హెడ్ క్వార్టర్ లోనికి ఆర్టిసి బస్సులు రావాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ మండలం కార్యదర్శి దుగ్గిరెడ్డి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. అనంతరం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సాయంత్రం దాటితే చాలు ఆర్టీసీ బస్సులు ఖాజీపేట టౌన్‌లోకి రాకుండా బైపాస్ లో వెళ్తున్నాయని అలా వెళ్లడం వల్ల మండలంలోని ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు పట్టణాలకు వెళ్లి తిరిగి ప్రజలు ఖాజీపేటకి రాత్రి సమయంలో రావాలంటే దాదాపు 2నుండి 3కిలోమీటర్ల వెళ్లాల్సి ఉంటుంది. ఖాజీపేటలో స్టాపింగ్ ఉండే బస్సులు కూడా ఖాజీపేట టౌన్ లోకి రాకుండా బైపాస్ లో వెళ్తున్నాయని అంతేకాక రాత్రి సమయంలో మైదుకూరు టికెట్ తీసుకొని ఖాజీపేట బైపాస్‌లో బస్సులు దిగాల్సి వస్తుంది కావున మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డిపోలకు చెందిన బస్సులకు మా మండలంలో స్టాపింగ్ పాయింట్ ఏర్పాటు చేసి ప్రజలకు అదనపు చార్జీల భారాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయ పల్లె మల్లికార్జున్ రెడ్డిని కోరారు. అనంతరం ఆయన స్పందిస్తూ వెంటనే ఏర్పాటు చేస్తామని చెప్పారని రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విగ్నేష్ , నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వార్తకు స్పందన

## భూ ఆక్రమణ తొలగించిన రెవెన్యూ అధికారులు

ఓబులవారిపల్లె, జూన్ 12, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు రెవెన్యూ పొలెం సర్వే నెంబర్ 923లో రెండు రోజుల క్రితం కొందరు ప్రభుత్వ భూమి ఆక్రమించి చదును చేయడంతో రెవెన్యూ అధికారులు స్పందించి సోమవారం ఆక్రమణలు తొలగించారు. అందులో ఉన్న ముళ్ల కంచె సిమెంటు తీసివేసి యథావిధంగా ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ పీర్‌మున్నీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, వీఆర్ఓ శివప్రసాద్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# రైపు హైవే బాధిత రైతులకు గ్రామ సభలు

చాపాడు, జూన్ 12, ప్రభాతవార్త:

కడప- బెంగుళూరు- విజయవాడ, 564 అనుసంధాన జాతీయ రహదారి భూములు కోల్పోయిన గ్రామాలైన అల్లాడుపల్లె, పిచ్చపాడు, బద్రిపల్లె గ్రామ పొలాల రైతులు ఆయా గ్రామాలలోని సచివాలయాల పరిధిలో రేపు గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ . సుభాని. తెలిపారు. కావున భూములు కోల్పోయిన బాధిత రైతులు వారి యొక్క 1బిఅడంగల్, డాక్యుమెంట్ తో పాటు, లింకు డాక్యుమెంట్లు తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

**పాసుపోర్టు పోయినది**

పొంతగిరి శివయ్య తండ్రి: పొంతగిరి నరసింహులు డి.నెం. 5-52, ఎస్టీ కాలనీ, సి.ఎం. రాచపల్లి, చిట్వేలి మం॥, అన్నమయ్య జిల్లా, ఎ.పి. - 516 110 నా పాస్ పోర్టు నెం. H8630887 నాపాస్‌పోర్టు చిట్వేలి గ్రామంలోని జిరాక్స్ సెంటర్ వద్ద పోయినది. దొరికినచో సెల్‌నెం. 9505825174 తెలుపగలరు.

## జగనన్న విద్యా కానుక పంపిణీ

కలికిరి, జూన్ 12, ప్రభాతవార్త:



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఉర్దూ) లో సోమవారం జగనన్న విద్యా కానుక పంపిణీ జరిగింది. పాఠశాల ల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 102 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం కింద యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టు, షూ తదితర వస్తువులు గ్రా సర్పంచ్ బీబీ ఆయేషా, స్కూలు ఛైర్మన్ షమీవుల్లా, యువ నాయకులు ఇష్తియాక్ అహ్మద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయ బృందం, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతివిద్యార్థి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నదే లక్ష్యం

పెద్దమండ్యం జూన్ 12 ప్రభాతవార్త



ప్రతివిద్యార్థి విద్యలో బాగారాణించి ఉన్నత స్థాయికి చేరి ఉన్నతపదవులుచేపట్టాలన్నదే ముఖ్యమంత్రి జగన్ అభిమతమని ఎంపిపి పూర్ణచంద్రికారమేష్ అన్నారు. సోమవారం పాఠశాలలు మొదలైనరోజే జగనన్నవిద్యాకిట్లను పంపిణీచేశారు. 1నుండి10వతరగతి విద్యార్థులకు,స్కూల్‌బ్యాగులు,పాఠ్యపుస్తకాలు,డిక్షనరీ,బెల్టు 3జతలయూనిఫాంలు అందచేశారు.తాసీల్దార్‌రాము మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యాకానుక వరంఅనిఅన్నారు.విద్యార్థులభవిషత్తేజగన్‌ముఖ్యమని ఎంఈవో మనోహర అన్నారు.పిల్లలుబాగాచదివి మంచిపదవులచేపట్టాలని ఎంపిడివో శ్రీధర్ అన్నారు.ప్రతిపాఠశాలల్లో సుమారు4007మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌బాషా,ప్రిన్సి పాల్ రామాంజులు నాయక్,ఎంపిటిసి జయరాం,కోఆప్షన్ ఖాదర్‌వల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిచిన్నారికి స్వేచ్ఛాయుత జీవితం కల్పించాలి



పెద్దమండ్యం జూన్ 12 ప్రభాతవార్త

బాలవిద్యార్థులకు స్వేచ్ఛాయుత,ఆరోగ్యకరమైన అహ్లాదకరమైన వాతావరణంలో జీవితంసాగేలా చూడాలని పోర్డ్‌స్వచ్ఛంద సమస్థడైరెక్టర్ లలితమ్మ ఆదేశాల మేరకు సమన్వయకర్త నరసింహారెడ్డి అన్నారు.సోమవారం బాలకార్మికులవ్యతి రేకదినంసందర్భంగావిద్యాశాఖ, ఆరోగ్యశాఖ,ఐసిడిఎస్, వాలంటీర్లు, తల్లిదండ్రులు కలసి బండ్రేవులో ప్లకార్డులుచేతపట్టి,పురవీధులగుండా తిరుగుతూ అవగాహన కల్పించారు.18సంవత్సరాలలోపు పిల్లలను పనుల్లోకి తీసుకోకూడద అన్నారు. ప్రతిపాఠశాల్లో విద్యార్థులకు ఆటలపోటీలు,చిత్రలేఖనం నిర్వహించినట్లు తెలిపారు.ప్రతిచిన్నారిని స్వేచ్ఛాయుత జీవితంకల్పించాల్సి బాధ్యత మనందరిదని అన్నారు.ఈకార్యక్రమంలోసిబ్బంది అనిత,రెడ్డెమ్మ, రమణ,నరశింహులు,భువనే శ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవం

మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త :



పట్టణంలోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయ 10వ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు పి.ఓంప్రకాష్ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం 6గంటలకు సుప్రబాత సేవ, 7గంటలకు శ్రీ గణపతి పూజ, స్వస్థివాచనం, నవగ్రహపూజ, కలశస్థాపన, అభిషేకం, హోమం జరిగింది. 11 గంటలకు మహాపూర్ణాహుతి, 11.45గంటలకు మహామంగళహారతి, మధ్యాహ్నం 12.15నిమిషాలకు తీర్థప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని నిర్మించి పదేళ్ళు పూర్తియిన సందర్భంగా ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో అధ్యక్షునితో పాటు సెక్రటరీ సతీష్, ట్రెజరర్ సూరే గిరిధర్, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పంపిణీపై ఆర్డీఓకు ఫిర్యాదు



మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త :

పట్టణంలోని 23వ వార్డులో ప్రజలకు రేషన్‌బియ్యం గత ఆరునెలలుగా అందడం లేదని ఆ వార్డు ప్రజలు, వైఎస్ఆర్ సిపి పార్టీ కన్వీనర్ సాయిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ ఎంఎస్.మురళికి ఫిర్యాదు చేశారు. కన్వీనర్ ఆధ్వర్యంలో ప్రజలు సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆర్డీఓకు విన్నవించారు. ఈ సందర్భంగా సాయిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఆరునెలలుగా వార్డులో ప్రజలు రేషన్‌బియ్యం సరఫరా చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు, నాలుగు రేషన్‌షాపులు దూరంగా ఉండడం వల్ల కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రతినెల ఇంటివద్దకే రావాల్సిన ఎండియూ వాహనం అందుబాటులో లేకపోతోందని తెలిపారు. వార్డు వాలంటీర్లు, వీఆర్‌ఓల నిర్లక్ష్యం వల్లే ప్రజలు నిత్యవసర సరుకుల అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. బియ్యం సరఫరాకు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.

## బి.కొత్తకోటలో 4955 మంది విద్యార్థులకు విద్యా కానుక



బి.కొత్తకోట, జూన్ 12, ప్రభాతవార్త:

బి.కొత్తకోట మండలంలోని 66 ప్రాథమిక, ప్రాదమికోన్నత, ఉన్నత, మోడల్ స్కూళ్లలోని 4955 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందజేసినట్లు ఎంఈవో రెడ్డిశేఖర్ విలేకరులకు తెలిపారు. సోమవారం బి.కొత్తకోటలో జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎన్నడూ లేని విధంగా పాఠశాలల ప్రారంభం రోజునే ప్రభుత్వం విద్యార్థులకు సుమారు రూ.3వేల విలువ చేసే జగనన్న విద్యా కానుక అందించడం హర్షణీయమన్నారు. విద్యా కానుకలో బ్యాగు, బెల్టు, టై, డిక్షనరీ, మూడు జతల యూనిఫాం, బూట్లు,నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మండలంలోని విద్యార్థులందరికీ రెండు, మూడు రోజుల్లో పూర్తిగా జగనన్న విద్యా కానుక పంపిణీ చేస్తామని ఎంఈవో తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, ఎస్ఎంసీ సభ్యులు,హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్టేషన్‌లో వ్యక్తి వీరంగం : కేసు నమోదు

మదనపల్లెక్రైం, జూన్ 12 ప్రభాతవార్త :

మద్యం తాగిన యువకుడ్ని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులపై ఓ వ్యక్తి వీరంగం సృష్టించిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గాలివీడు మండలం తూముకుంటకు చెందిన సేలం జగదీష్‌నాయుడు(31) కొంతకాలం క్రితం మదనపల్లెకు వచ్చి బికేపల్లెకాలనీలో ఉంటూ ఫైనాన్స్ ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఒకటవ పట్టణ ఎస్ఐ హరిహరప్రసాద్ నీరుగట్టువారిపల్లెలో పర్యటిస్తూ బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న ఏడుగురిని స్టేషన్‌కు తీసుకువచ్చాడు. వీరిలో నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీకాంత్ ఉండడంతో ఇతని స్నేహితుడైన జగదీష్‌నాయుడు స్టేషన్‌కు వచ్చి తన స్నేహితున్ని వదిలిపెట్టాలని పోలీసులపైకి గొడవకు దిగాడు. స్టేషన్‌లోకి దూరి వీరంగం సృష్టించాడు. బలవంతంగా శ్రీకాంత్‌ను స్టేషన్ నుంచి తీసుకెళ్ళేందుకు ప్రయత్నించాడు. అడ్డువచ్చిన పోలీసులను పక్కకు తీసేయడంతో పాటు వాగ్వాదానికి దిగారు. దీంతో జగదీష్‌నాయుడును అదుపులోకి తీసుకొన్నారు. హెడ్‌కానిస్టేబుల్ మోహన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరిహరప్రసాద్ నిందితుడిపై పోలీసు విధులకు ఆటంకం కలిగించాడని సోమవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

## క్రికెట్ టోర్నమెంటు విజేత తిరుమలరెడ్డిపల్లె

రామసముద్రం, జూన్ 12 ప్రభాతవార్త:



రామసముద్రం మండలం పెద్దకురపల్లె పంచాయితీ తిరుమలరెడ్డిపల్లె యూత్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా క్రికెట్ టోర్నమెంటు నిర్వహిస్తున్నారు. ఈ క్రికెట్ టోర్నమెంటు ప్రకాష్, మునిరాజాల జ్ఞాపకార్థంగా ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు 14టీములు పాల్గొన్నాయి. ఈ టీమ్‌ల్లో 30టీమ్‌లు పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.30,116లు తిరుమలరెడ్డిపల్లె జట్టు విజయం చేసుకొంది. రెండవ బహుమతి మానేవారిపల్లె రూ.20,161, మూడవ బహుమతి రూ.10,161లు బి.కొత్తకోట క్రీడాకారులు గెలుచుకొన్నారు. నాల్గవ బహుమతి రూ.5,161లు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో అలీషా, అఫ్రోజ్, బాషా, అశోక్, రాము, వల్లాల దర్శన్‌రాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యాకానుక కిట్లు పంపిణీలో సర్పంచ్ చిప్పిలి చలపతి

మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యాకానుక కిట్లు సద్వినియోగం చేసుకోవాలని కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి పేర్కొన్నారు. కురవంక పంచాయితీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 120మంది విద్యార్థులకు, అదే విధంగా ఉర్దూస్కూల్ విద్యార్థులు 60 మందికి విద్యాకానుక కిట్లును సర్పంచ్‌చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఒక విద్యార్థికి మూడు జతల యూనిఫారం, బూట్లు, సాక్సులు, స్కూల్ బ్యాగు, డిక్షనరీలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాటుసారా, బైక్ స్వాధీనం

మదనపల్లెక్రైం, జూన్ 12 ప్రభాతవార్త:

మదనపల్లె మండలంలోని దాదినాయునితాండాకు చెందిన రవినాయక్ తన బైకులో 36లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఈబి సిఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. సిఐ మాట్లాడుతూ సారా తరలిస్తున్న రవినాయక్‌ను చెంబకూరు రోడ్డులో అరెస్టు చేసి, బైక్‌ను స్వాధీనం చేఊకొని నాటుసారా సీజ్ చేశామన్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలపై తమకు సమాచారం అందించాలని వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## ప్రత్యేక హోదాపై కేంద్రాన్ని ప్రశ్నించిన వీసికే

మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త :



ఉమ్మడి రాష్ట్రం విభజన చెందిన 9ఏళ్ళు అవుతున్నా రాష్ట్రానికి ఇంతవరకు ప్రత్యేక హోదా ఇవ్వలేదని కేంద్ర ప్రభుత్వాన్ని వీసికే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ ప్రశ్నించారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడతూ 2014 ఎన్నిల ప్రచారంలో నరేంద్రమోడీ, చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేరలేదన్నారు. ప్రత్యేక హోదాపై వాగ్దానాలు చేసి తొమ్మిదిఏళ్ళుఅవుతున్నా ఇంతవరకు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. గత రెండు రోజులుగా నడ్డా, అమీత్‌షాలు ఏపిలో పర్యటిస్తున్న సందర్భంగా వారిని ప్రశ్నించారు. తొమ్మిదేళ్ళ బిజెపి పాలనలో దేశం అన్ని విధాల దెబ్బతిందన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి ఓటమి తప్పదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు ముత్యాలమోహన్, మనోహర్, రెడ్డప్ప, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ప్యాకల్టి సదస్సు

మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త :



పట్టణ సమీపంలోని వలసపల్లె వద్ద ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఐదురోజులు పాటు ప్యాకల్టి డెవలప్‌మెంటు ప్రోగ్రామ్ కృత్తిమమేదస్సు, ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం డేటా విశ్లేషణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. కళాశాలలోని సిఎస్ఈ డిపార్టుమెంటు, ప్యాకల్టిడెవలప్‌మెంట్ సెల్, జేఎన్‌టియుఎ, ఐఎస్‌టిఈ రాష్ట్ర విభాగంతో కలిసి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిధిగా ప్రొఫెసర్ పిఆర్.భానుమూర్తి, ప్రొపసర్‌ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ జేఎన్‌టియుఏ గౌరవ అతిధి ఏ.జయప్రకాష్‌లు హాజరవుతారన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సతీష్, కన్వీనర్ డాక్టర్ ఎండి.షఫి, అన్ని విభాగాల హెచ్‌ఓడిఎస్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆదరించండి ఆశీర్వదించండి అండగా ఉండి సమస్యలు పరిష్కరిస్తా

### తెదేపా జాతీయ నేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

పీలేరు, జూన్ 12ప్రభాతవార్తః



కలికిరి పట్టణంలో ఇంటింటికి నల్లారి కార్యక్రమం రెండవ రోజు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి చేపట్టారు. కురవపల్లె, పొట్టేకులవారిపల్లెలో ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని పలకరించారు. చెక్కుచెదరని ఆత్మీయత, వెలకట్టలేని ఆదరాభిమానాలతో తన సొంత మండలంలో ప్రజలు, రైతులు, మహిళలు అభిమానులు హారతులతో ఘన స్వాగతం పలికారు. తెదేపా అధికారంలోకి వస్తే మహిళలకు, రైతులకు, యువతకు ప్రథమస్థానం కల్పించి అన్ని విధాలుగా సంక్షేమాన్ని అందించే విధంగా మేనిఫెస్టో విడుదల చేయడం జరిగిందని ఇంటింటికి కరపత్రాలను పంచిపెట్టారు. నియోజకవర్గంలో ఎవరికి ఏసమస్య వచ్చినా అండగా ఉంటానని ఆదరించాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పేద మధ్య తరగతి కుటుంబాలకు నడ్డి విరుస్తుందని నిత్యావసర వస్తువుల ధరలు పెంచారని విమర్శించారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జగన్ తుగ్లక్ పాలనలో మహిళలకు రక్షణ కరవైంది

### పర్వీన్ తాజ్

బి.కొత్తకోట, జూన్ 12, ప్రభాతవార్త:



రాష్ట్ర సీఎం జగన్ తుగ్లక్ పాలనలో మహిళలకు రక్షణ పూర్తిగా కరవైందని రాబోయే ఎన్నికల్లో మహిళలే వైకాపాను రాజకీయ సమాధి చేయడం ఖాయమని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్ తాజ్ విమర్శించారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అరాచకాలకు అడ్డాగా మారి రౌడీలు, గూండాలు, రేపిస్టులు రెచ్చిపోతున్నా పోలీసులు జగన్‌రెడ్డి సేవలో తరిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పోలీసులు శాంతిభద్రతలు గాలికొదిలేశారని ప్రశ్నించే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేయడం, అక్రమ కేసులు బనాయించడం సర్వసాధారనమైందని విమర్శించారు. జాతాగా నెల్లూరులో పట్టపగలే నడిరోడ్డుపై యువతిని కిడ్నాప్ చేసి రేప్ చేసిన అగంతకులు అంబోతుల్లా రెచ్చిపోవడం ఇంతకంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలు, మాన ప్రాణాలు కాపాడలేని ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు టీడీపీని అందలమెక్కించి వైకాపాను చిత్తుగా ఓడించి బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు.కార్యక్రమంలో చావిడి కిట్టన్న, పట్టా చంద్రమోహన్‌రెడ్డి, ప్రభాకర్, గట్టు చంద్రన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చదివేవాండ్లపల్లెలో జగనన్న విద్యాకానుక పంపిణి

పీలేరు, జూన్ 12 ప్రభాతవార్తః



కలికిరి మండలంలోని చదివేవాండ్లపల్లె ఇందిరమ్మ కాలనీ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతప్‌కుమార్, ప్రకాష్,ముబారక్, అరుంధతి,ఉష సబితా వైసీపీ వార్డుమెంబర్లు ఖాదర్‌బాషా, విశ్వనాథ్ విద్యార్తుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సీపీఐ నాయకులు జేసికి వినతి

పీలేరు,జూన్ 12 ప్రభాతవార్తః



పీలేరు-తిరుపతి రహదారికి ఆనుకుని ఉన్న శ్రీకష్ణ దేవరాయల నూనె విత్తుల కర్మాగారం భూముల్లో అధికార పార్టీ నాయకులు చేపడుతున్న ఇంటి నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి కర్మాగారం భూముల్లో నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాలను తక్షణమే తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి సాంబశివ కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ పర్మన్ అహ్మద్‌ఖాన్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు.

## విద్యా రంగానికి పెద్దపీఠ వేసిన సీఎం జగన్

కలకడ, జూన్ 12 ప్రభాతవార్తః



మండలంలో గరుడప్పగారిపల్లె ఏపీఆర్ఎస్ పాఠశాలలో ఎంఈఓ మునేంద్రనాయక్ సింగిల్ విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, కోన గ్రామ సర్పంచి రాజగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార ్యక్రమానికి ఎంపీపీ శ్రీదేవిరవికుమార్ హాజరై మాట్లాడుతూ మన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్తుల ఉజ్వల భవిష్యత్తును ఇవ్వడానికి జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, వంటి పథకాలను, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ విద్యార్తులకు ఫీజు రియంబర్సుమెంటు, విదేశీ విద్య కొరకు ఆర్థిక సహాయాలను అందజేయడం జరిగిందని అన్నారు. ఎంఈఓ మునేంద్రనాయక్, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, కోన గ్రామ సర్పంచి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీపీచే విద్యార్తులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అంగన్‌వాడీలు

వాల్మీకిపురం, జూన్ 12 ప్రభాతవార్తః



కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అంగన్‌వాడీలను తీర్చి దిద్దడం జరిగిందని సీడీపీఓ భారతి అన్నారు. బాల కార్మిక నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని స్థానికంగా జనబాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన విద్యార్తుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాల వయస్సు నుంచి ఆరు సంవత్సరాల వయ స్సు ఉన్న పిల్లలను అంగన్‌వాడీలలో చేర్చాలన్నారు. పూర్వపు ప్రాథమిక విద్య అంటే ఆటబొమ్మలు, చార్టులు, ప్రాథమిక విద్యను బోదిస్తారన్నారు. వస్తువులతో ఆడుకుంటూ పిల్లలు చదువుకునే విధంగా వాతావరనం ఏర్పాటుచేశామన్నారు. బాల కార్మిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్య క్రమంలో హెచ్ ఎం ఓబుల్‌రెడ్డి, సూపర్‌వైజర్ రోహిణి, నౌషాద్, అనిత, శ్రీనివాసులు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతుకు న్యాయం చేయాలంటూ సబ్‌కలెక్టర్ వద్ద నిరసనలు

మదనపల్లె, జూన్ 12 ప్రభాతవార్త :



అన్ని విధాల నష్టపోయిన సుధాకర్ అనే రైతు కుటుంబానికి న్యాయం చేయాలంటూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ ఎంఎస్.మురళికి ఫిర్యాదు చేశారు. బి.కొత్తకోట మండలం జనుకువారిపల్లెకు చెందిన సుధాకర్ అనే రైతు భూమిలోకి అదే గ్రామానికి చెందిన త్యాగరాజు అనే వ్యక్తి దౌర్జన్యంగా భూమిలోకి చొరబడి 6వేల టమోటా కట్లు, డ్రిప్ పైపులను, పివిసి పైపులకు నిప్పు పెట్టి దహనం చేశారన్నారు. అది గమనించిన సుధాకర్ కుటుంబం ప్రశ్నించగా వారిపై కూడా దైర్జన్యం చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఈ ఘటనపై బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎలాంటి న్యాయం జరగలేదని బాధితుల తరపున పునిత్ అనే వ్యక్తి ప్రశ్నించారు. వెంటనే విచారణ జరిపి రైతుకు న్యాయం జరపాలని కోరారు.

## ఎపివోగా బాధ్యతలు చేపట్టిన సి. రామచంద్ర

గాలివీడు, జూన్ 12ప్రభాతవార్త:



మండల ఏపివోగా సి. రామచంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అనంతపురం జిల్లా కుందుర్పి మండల ఎపివోగా విధులు నిర్వహిస్తూ రేషన్‌లైజేషన్‌లో బదిలీపై రావడం జరిగిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

### – ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి, జూన్ 12, ప్రభాతవార్త:



వెల్లటూరు గ్రామ పంచాయతీలో గడప గడపకు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ఎక్కడ ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా ప్రజలకు సుపరిపాలనకు వచ్చే ఎన్నికల్లో వైకాపాను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త హుసేన్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## టీడీపీ పాలనలో సీమకు అన్యాయం

### – వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్, జూన్ 12, ప్రభాతవార్త:




ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమకు తీరని అన్యాయం చేశారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసినట్లు పాదయాత్ర చేస్తున్న టీడీపీ యువనేత నారా లోకేష్ జిల్లాలో పర్యటించి రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్నా చంద్రబాబు రాయలసీమకు ఎలాంటి మేలు చేకూర్చలేదన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని తెలిపారు. దివంగత వైఎస్ఆర్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచే క్రమంలో చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. రాయలసీమ హైకోర్టు ఏర్పాటును అడ్డుకుంటూనే ఉన్నారన్నారు. రాయలసీమ రౌడీలు గూండాలంటూ మాట్లాడిన చంద్రబాబుకు ఈ ప్రాంత ప్రజల ఓట్లు అడిగే అర్హత ఉందా అని ప్రశ్నించారు. తండ్రి, తనయుల కబుర్లు వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరని వచ్చే ఎన్నికల్లో టీడీపీకి తగిన గుణపాఠం చెబుతారన్నారు. లోకేష్ పాదయాత్రకు స్పందన లేదని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు కరీం, జిలానీ, వైఎస్ఆర్‌సీపీ యువ నాయులు ఫయాజ్‌ఖాన్ పాల్గొన్నారు.

## బీజేపీపై తులసిరెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

వేంపల్లె, జూన్ 12, ప్రభాతవార్త :



బీజేపీపై కాంగ్రెస్ పార్టీ మీడియా కన్వీనరు తులసిరెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గాలి హరిప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వి లేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ 9ఏళ్లగా సుపరిపాలన అందిస్తూ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టి, దేశ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ఉంటే ఓర్వలేని కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి కంటి కి మాత్రమే కనపడలేదన్నారు. మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు బీజేపీకి ఏమైనా సంబంధం ఉందా అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్‌ను అధ్య యనం చేసే మీకు రాజ్యాంగాన్ని అనుసరించి పనిచేసే సుప్రీంకోర్టు, సీబీఐ, ఎన్ని కల కమీషన్ వంటి వాటిపై ప్రభుత్వ పెత్తనం ఉంటుందాని అని ప్రశ్నించారు. దేశంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఆర్టికల్ 370రద్దు, ట్రిపుల్ తలాక్, రామమందిరం నిర్మాణం వంటి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించిన ఘనత భారత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందన్నారు. ఈ దేశానికి పట్టిన ఏలిననాటి శని అంటే అది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకునే స్థాయిలో బీజేపీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుష్మా, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గోపీనాథ్‌రెడ్డి, నాగేష్, శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## పుల్లంపేటలో గ్రీవెన్‌సెల్

పుల్లంపేట, జూన్ 12 ప్రభాతవార్త



పుల్లంపేట తహశిల్దారు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్‌సెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ప్రజలు పలురకాల అర్జీలతో తహశిల్దారును కలిసి వారి సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయడం జరిగింది. కొన్ని అక్కడికక్కడే పరిష్కారం కాగా మరికొన్ని విఆర్‌ఒల ద్వారా, ఆర్ఐ ద్వారా పరిష్కరించాలని తహశిల్దారు కుమార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు విఆర్‌ఒలు, ఆర్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర సంక్షేమానికి భవిష్యత్తు ప్రణాళిక సురేంద్ర యాదవ్

బి.కొత్తకోట, జూన్ 12, ప్రభాతవార్త:

రాష్ట్ర మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు వడ్డెర్ల సంక్షేమానికి భవిష్యత్తు ప్రణాళిక ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి కృషి చేయనున్నట్లు రాజంపేట పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షులు సురేంద్ర యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం మండలంలోని వడ్డెర సంఘ సభ్యుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు బీసీలకు తెదేపా అండగా నిలిచిందని రాబోయే రోజుల్లో బీసీలకు రచన చట్టంతో పాటు ఉప కులాల సంక్షేమానికి భవిష్యత్తు ప్రణాళికతో అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ కులాలలో వడ్డెర కులస్థులు వైకాపా పాలనలో అన్ని రంగాల్లో పూర్తిగా వెనకబడినట్లు చెప్పుకొచ్చారు. గత ఎన్నికల్లో జగన్ బీసీలకు నమ్మించి నట్టేట ముంచాడని రాబోయే ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేసి వారి అభివృద్ధికి తెదేపా కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవరింటికుమార్, వడ్డెర సాధికార సమితి కన్వీనర్ డేరంగుల నారాయణ, ఉప సర్పంచ్ షమీవుల్లా, రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి మస్తాన్, కిట్టన్న, మహేష్, నాగమల్లప్ప, మరియు తెదేపా బీసీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక పంపిణీ



కేవి.పల్లె, జూన్ 12 ప్రభాతవార్తః

మండలంలోని కేవి.పల్లె మోడల్ స్కూల్ లో సోమవారం జగనన్న విద్యాకానుకలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 4279 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగుతో పాటు దుస్తులు, బూట్లు, సాక్సులు, బెల్టు, అచ్చుపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిష్నరీలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మొత్తం విలువ ఒక కోటి 20లక్షలు రూపాయలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన విద్యాసామగ్రిని విద్యార్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరమ్మ, జడ్పీటీసీ గజ్జల శ్రుతి, ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్, పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్, స్కూల కమిటీ ఛైర్మన్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకు విద్యా ప్రమాణాలే దోహదం

**పులివెందుల, జూన్ 12, ప్రభాతవార్త :**



పేదరిక నిర్మూలనకు, విద్యార్థుల ఉత్తమ భవిష్యత్తు నిర్మాణానికి జగనన్న అవలంబిస్తున్న విద్యాప్రమాణాలు దోహదపడతాయని మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ అన్నారు. పులివెందులలోని అహోబిళాపురం మోడల్ స్కూల్లో సోమవారం జగనన్న విద్యాకానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థికి మూడు జతల యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, కుట్టుకూలీతో సహా ఒక జత బూట్లు, బెల్టు, స్కూల్ బ్యాగుతో పాటు ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లను మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, నాల్గో వార్డు కౌన్సిలరు పార్నపల్లె కిషోర్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బేబీ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యా కనుక పంపిణీ

**పెండ్లిమర్రి, జూన్ 12, ప్రభాతవార్త:**



మండలంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ ఛైర్మన్ బాలయ్య మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక 4వ విడత పంపిణీ చేయడం సంతోషంగా ఉందని సీఎం జగన్ మోహన్‌రెడ్డి విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు జగనన్న కిట్లలోని నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, షూ, సాక్స్‌లు, బ్యాగును సద్వినియోగం చేసుకోవాలని బాగా చదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ చంద్రారెడ్డి, తహసీల్దార్ ఉదయ్ భాస్కర్‌రాజు, ఎంఈవో సుజాత, సర్పంచ్ నాగమల్లారెడ్డి, హైస్కూలు హెచ్‌ఎం కళావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై తులసిరెడ్డి ఫైర్

**వేంపల్లె, జూన్ 12, ప్రభాతవార్త :**



బీజేపీకి ఏపీలో 20 ఎంపీ సీట్లు ఇవ్వండి.. ఏపీని అభివృద్ధి చేస్తామని ఆదివారం విశాఖ బహిరంగ సభలో కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహానికి 20 ఎంపీ సీట్లు కాదు కదా.. 20 ఓట్లు కూడా వేయకూడదని రాష్ట్ర పొలిమేరల నుండి తరిమి కొట్టాలని తులసిరెడ్డి అన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంతం, ఇచ్చింది గోరంత అన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా నాటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి మూడు వరాలిచ్చిందన్నారు. తరువాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా తుంగలో తొక్కిందన్నారు. రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీని రాష్ట్రం నుండి తరిమి కొట్టాలని తులసిరెడ్డి పిలుపునిచ్చారు.

## విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

**వేంపల్లె, జూన్ 12, ప్రభాతవార్త :**



విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని వేంపల్లె గ్రామ పంచాయతీ సర్పంచి రాచనేని శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న విద్యాకానుక కిట్లను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనిపెంట షకీల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులకు అవసరమైన బుక్స్, బ్యాగ్స్, షూ, యూనిఫాం అందించడం విశేషమన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండాలని, అధునాతన భవనాలు, లైబ్రరీ, ల్యాబ్స్, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాబాషరీఫ్, వైకాపా నాయకులు కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పర్వీన్, సలావుద్దీన్, గౌసియాబేగం, సరస్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

**విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి**

**– 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ**

**బద్వేలు అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త :**



విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల విద్యా సామాగ్రిని అందజేయడం జరుగుతుందని, కావున ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎరుకలపాళెం ప్రాథమిక పాఠశాల నందు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 17వ వార్డు కౌన్సిలర్ దుద్దుకూరు సత్యనారాయణ హాజరై విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేశారని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకున్న అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకునే విధంగా ముందుకు పోవాలన్నారు. జగనన్న విద్యా కానుకే కాకుండా విద్యార్థులకు మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని కూడా నాణ్యతగా అందజేయడం జరుగుతుందని, గతంలో విద్యార్థులకు ఇలాంటి పథకాలు ఉండేవి కాదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలలో భాగంగా ఇచ్చిన మటకు కట్టుబడి విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నాగబసవరాజు, సహోపాధ్యాయులు జయమ్మ, అరుణ కుమారి, సంగీత, సుధారాణితో పాటు పలువురు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో గౌరవప్రదమైన స్థానం

**దువ్వూరు, జూన్ 12, ప్రభాతవార్త:**



సమాజంలో చదువుతోనే ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన స్థానం లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ ప్రధాన సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం దువ్వూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు గౌరవం, గుర్తింపు ఉండాలంటే విద్యార్థులకు చదువు ఒక్కటే మార్గమన్నారు. చదువుకు మించిన ఆస్తి మరొకటి లేదని అందుకే సీఎం జగన్ విద్యా వ్యవస్థకు మరింత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు ధీటుగా ఉన్నాయన్నారు. విద్యా కానుకలో పాఠ్యపుస్తకాలు 3జతల దుస్తులు, బూట్లు, బెల్టు, స్కూలు బ్యాగుతో పాటు డిక్షనరీ అందించారు.కార్యక్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రమాకుమారి, మండల ప్రత్యేక అధికారి ఓబులేసు నందన్, సర్పంచ్ చెంద్రాయుడు, ప్రధానోపాధ్యాయుడు వీరయ్య పాల్గొన్నారు.

## జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేసిన సర్పంచ్ జయచంద్ర

**సుండుపల్లి, జూన్ 12ప్రభాతవార్త:**



సుండుపల్లి మండలం చిన్నగొల్లపల్లె పంచాయతీలో ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయుల వనజాక్షి, రామయ్య పిలుపుమేరకు ప్రభుత్వం కల్పించే పిలుపుమేరకు ప్రభుత్వం కల్పించే జగనన్న విద్యాకానుకను విద్యార్థులకు మూడు జతల యూనిఫామ్, బట్టలు, బ్యాగ్, పాఠ్యపుస్తకాలు స్థానిక సర్పంచ్ రామజయచంద్ర అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులకు విద్య ఒకటే పేదవారి తలరాతను మారుస్తుందనే దృఢ సంకల్పాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు జగనన్న ఆశయానికి కృషి చేయాలని, పట్టుదలతో విద్యార్థులు ప్రతిభను సాధించాలని తెలిపారు. గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు పాఠశాల బిల్డింగ్‌లను రూపురేఖలు మార్చి కార్పొరేట్ విద్యను అధిగమించామని, ఆంగ్లంలో విద్యను, త్రిబులైట్ విద్యను పేద విద్యార్థుల విద్యను అందజేసిన ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నదని గర్వంగా చెప్పుకునే జగనన్న కృతజ్ఞతలు ప్రజల తరపు నుంచి తెలుపుతున్నారని సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం రోజే 9 అడ్మిషన్లు జరిగాయని ఇలా విద్యార్థులు రావాడానికి కారణం మన ముఖ్యమంత్రి జగనన్న విద్యపై శ్రద్ధ చూపడమే కారణమని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రజలు భక్తి భావాలు అలవర్చుకోవాలి

**– మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు**

**రాయచోటి టౌన్, జూన్ 12ప్రభాతవార్త:**



సమాజంలో ప్రజలందరూ భక్తి భావాలు అలవర్చుకోవాలని రాయచోటి నియోజకవర్గం మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కోరారు. రాయచోటి రూరల్ మండలం దిగువ అబ్బవరం ఇందుకూరుపల్లి, కమ్మపల్లి క్రాస్ దగ్గర సోమవారం నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి గుడి శంఖుస్థాపన కార్యక్రమంలో గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎంపి సుగవాసి పాలకొండరాముడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు పాలకొండ్రాయుడికి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీంద్రనాయుడు, సుబ్బయ్య నాయుడు, తిరుపాల్ నాయుడు, గోవింద్, మేస్త్రి రమణ, శ్రీనివాసులునాయుడు, రాజేంద్ర నాయుడు, శేఖర్, రమేష్, చిన్నప్ప,

## విద్యాకానుక కిట్‌లు పంపిణీ

**పుల్లంపేట, జూన్ 12 ప్రభాతవార్త**



మండలంలోని అప్పయ్యరాజుపేట గ్రామ పంచాయతిలో ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్‌లను ఉపసర్పంచ్, వైఎస్ ఆర్‌సిపి మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ విద్యార్థిని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్తాక్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్యకు అత్యధిక ప్రాముఖ్యతను ఇస్తూ గ్రామాల్లో పాఠశాల రూపురేఖలను నాడు నేడు కార్యక్రమం ద్వారా మార్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి ముత్తయ్య, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు హైమావతి,స్కూల్ కమిటిసభ్యులు,

## ఉపాదిహామి ద్వారా రైతులకు మెరుగైన పండ్ల మొక్కలు

**రైల్వేకోడూరు రూరల్, జూన్ 12 ప్రభాతవార్త**

ఉపాదిహామీ ద్వారా రైల్వేకోడూరు మండలంలోని వ్యవసాయ రైతులకు ప్రభుత్వం జామ, సపోటా, డ్రాగన్‌ఫ్రూట్స్ తదితర పంటలను పెంపకం చేసుకోవచ్చునని, అభివృద్ధిలోకి పయనించాలని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి నేతృత్వంలో ఉపాదిహామి పథకం ద్వారా రైతులకు పండ్ల మొక్కల పెంపకంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఇచ్చే పండ్లమొక్కల పట్ల రైతులు చిత్తశుద్ధితో పెంచుకొని అభివృద్ధిలోకి రావాలని ఎమ్మెల్యే కొరముట్ల అన్నారు. పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వ్యవసాయ రైతులకు వెన్నుదన్నుగా సబ్సిడీల ద్వారా రైతులను బాగు చేయాలనే ఉద్దేశ్యం ముఖ్యమంత్రికి ఉందని అన్నారు.కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కవిత, వ్యవసాయశాఖ అధికారి సుధాకర్, ఎపిఓ ఉమామహేశ్వర్‌రావు, జడ్‌పిటిసి రత్తమ్మ,ఉపాదిహామి సిబ్బంది పాల్గొన్నారు.

## కొండాపురంలో విద్యాకానుక పంపిణీ

**కొండాపుం, జూన్ 12, ప్రభాతవార్త :**



కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పంపిణీ చేశారు. తహసీల్దారు శోభన్‌బాబు, ఎంపీడీవో నాగప్రసాద్, ఎంఈవో ఓబులేసు, హెచ్‌ఎం రామయ్య, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సంధ్భంగా స్పెషల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మంచి పథకం.. మంచి చదువు పిల్లలు అభివృద్ధి చెంది బాగుపడి విద్యలో మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు 3407 జగనన్న విద్యా కిట్‌లను పంపిణీ చేశారు.

## చేనేత కళాకారులకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

**– టీడీపీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసా కోదండరామ్**

**కడప వైద్యవిభాగం, జూన్ 12, ప్రభాతవార్త:**



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశానుసారం టీడీపీ పద్మశాలీ సాధికార సమితి ఆధ్వర్యంలో బీసీల పోరుబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప జిల్లా ఒంటిమిట్ట మండలంలోని కొత్త మాధవరంలోని నేతన్నలను కలిసి వారికి తెదేపా ప్రభుత్వ హయాంలో నేతన్నల కోసం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలకు చేసిన మోసపూరిత హామీలను తెలియజేస్తూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని 5కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలను నేతన్నల ఇంటింటికి ప్రచారం చేస్తున్న టీడీపీ పద్మశాలీ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మాసాకోదండరామ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రన్న హయాంలో నూలు, రంగులపై సబ్సిడీ, చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25కోట్లు మూలధనం కింద రూ.30 కోట్లు సాయం, మర మగ్గాలకు 50% రాయితీ కోసం రూ.80కోట్లు ఖర్చు చేశారు. సొంత మగ్గం ఏర్పాటుకు 40% రాయితీతో రూ.2లక్షల వరకు రుణం అందించారు. మరణించిన చేనేత కళాకారునికి చంద్రన్న బీమాతో రూ.5లక్షల ఆర్థిక సాయం అందించామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు టీడీపీ పద్మశాలీ సాధికార సమితి కన్వీనర్ ఆలూరి వెంకట సుబ్బయ్య, టీడీపీ వార్డు మెంబర్ ఆలూరు నరసింహులు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నామాల వెంకట సుబ్బయ్య, కల్లేపల్లి వెంకట రమణ, బిట్టా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శేష వాహనంపైన భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

**బద్వేలు అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త :**



శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం టిటిడి వేద పండితులు మనోహరాచార్యులు, ఎ.నరసింహచార్యులు బృంధం, హరికృష్ణాచార్యులు, దినేష్ కృష్ణ, వెంకటేశాచార్యులు, పవన్ కుమార్ చార్యుల వేద మంత్రాలతో స్వామి వారికి వివిధ రకాల ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ధ్వజారోహణం, దేవతా ఆహ్వానం, మహాకుంభ ఆరాధన, చతుస్థానార్చన, తీర్థ ప్రసాదం, అనంతరం సంతాన ప్రాప్తి కొరకు గరుడ ప్రసాదాన్ని పలువురికి అందజేశారు. అనంతరం సాయంత్రం శేష వాహనంపైన శ్రీ కృష్ణావతారంలో శ్రీవారు పుర వీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. పురవీధులలో పలువురు భక్తులు భక్తి శ్రద్ధలతో స్వామివారికి మంచినీరు వార పోసి, కాయా కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ నిర్వాహకులు వి.వి.రమణ, కమిటీ సెక్రటరి గొడిసిపాటి అంకయ్య, తాతనబోయిన వెంకట సుబ్బయ్య, కంచర్ల గంగిరెడ్డి, నాగూరు సిద్దయ్య, చీదెళ్ళ వెంకట రమణయ్యతో పాటు తుంగా శేషయ్యతో పాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తారు జగదీష్, అడ్వకేట్ సాయి చరణ్, ముచ్చర్ల ప్రవీణ్, అనిత్, పబ్బతి సాయి సుమంత్, చీదెళ్ళ సాయి, సర్వేయర్ పెంచలయ్య, ధనలక్ష్మీ, రుక్మిణి, పలువురు కమిటీసభ్యులు భక్తులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ ఘనస్వాగతం పలికిన విజయమ్మ, రితీష్‌రెడ్డి

**బద్వేలు, జూన్ 12 ప్రభాతవార్త :**



యువగళం పాదయాత్ర రెండు రోజుల క్రితం బద్వేలు నియోజకవర్గంలో అడుగుపెట్టడంతో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువ నేత రితీష్ రెడ్డితో పాటు కైవల్యా రెడ్డి,నాయకులు టీడీపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికారు. అట్లూరు మీదుగా బద్వేలులోకి సోమవారం అడుగుపెట్టిన నేపథ్యంలో భారీ జన సమీకరణతో పాటు నారా లోకేష్‌కు అడుగడుగునా నీరాజనాలు పట్టే విధంగా ఏర్పాట్లు చేశారు. డ్రోన్ సహకారంతో నారా లోకేష్ పై పూలు పడేలా ఏర్పాటుచేయడం, పెద్ద పెద్ద కటౌట్లు ఏర్పాటుచేసి, భారీ బాణసంచా కాల్చి సభను విజయవంతం అయ్యేలా చేశారు. రాయలసీమలో ముగించుకునే రోజు నేడు కావడంతో రితీష్ రెడ్డి, విజయమ్మ చేసిన ఏర్పాట్లపై నారా లోకేష్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు. 7 మండలాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు ఈ పాదయాత్రను విజయవంతం చేసి సభను అనుకున్న దాని కన్నా ఎక్కువగా విజయవంతం చేయడంపై విజయమ్మ, రితీష్ రెడ్డిలు నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాగే 2024 ఎన్నికల్లో ప్రజాదరణతో టీడీపీని గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని ప్రజలకు వారు పిలుపునిచ్చారు.

## జగనన్న కాలనిలకు మెరుగైన వసతులు

**రైల్వేకోడూరు రూరల్, జూన్ 12 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మండలంలోని రెడ్డివారిపల్లెలో ఉన్న జగనన్న కాలనిలకు 33/11 కెవి సబ్‌స్టేషన్ కొరకు సోమవారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలను అభివృద్ధి చేసే సందర్భంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ మంజూరు కావడంతో దానిని వేగవంతంగా నిర్మాణం చేసేందుకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి జగనన్న కాలనీల్లో మెరుగైన వసతులను అందజేయడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక ప్రత్యేక నిధులను కేటాయించి అభివృద్ధిపథంలో నడిపిస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏరకంగా మౌళిక వసతులు ఉంటాయో అదేవిధంగా ఉంటాయో అదేవిధంగా పూర్తిస్థాయిలో జగనన్న కాలనీలకు అద్భుతమైన వసతులు ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. అదేవిధంగా వేగవంతంగా ఈ నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, జడ్‌పిటిసి పాలెంకోట రత్నమ్మ, సుధాకర్‌రాజు, బుడిగి శివయ్య, స్వీకారం శివయ్య, మస్తాన్, హరినాథ్, హరిక్రిష్ణతో పాటు విద్యుత్తు అధికారులు పాల్గొన్నారు.

## రక్త నిల్వలు సిద్ధం చేసేందుకు రక్తదానం ఏర్పాటు చేయాలి

**పిహెచ్‌సి అధికారులకు డిప్యూటి డిఎంహెచ్ఒ**

**రాజంపేట అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త**



ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజంపేట ఏరియా ఆసుపత్రిలో రక్తనిల్వలు సిద్ధం చేసేందుకు ప్రతిఒక్క పిహెచ్‌సి నుంచి రక్తదానం చేసే వారిని ఏర్పాటు చేయాలని డిప్యూటి డిఎంహెచ్ఒ డాక్టర్ చిన్నిక్రిష్ణ కోరారు. కుటుంబ సంక్షేమ కమిషనర్ వికాస్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి రక్తదాన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారన్నారు. రాజంపేట డివిజన్ పరిధిలోని నందలూరు, ఆకేపాడు, రాజంపేట పిపి యూనిట్, మన్నూరు అర్బన్ పిహెచ్‌సి, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, పెనగలూరు మండలాల పిహెచ్‌సి అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రతి పిహెచ్‌సి నుంచి హెల్త్ క్లీనిక్‌ల నుంచి సబ్ సెంటర్ల నుంచి కనీసం ఐదు మంది రక్తదానం చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని తప్పనిసరిగా అధికమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఏరియా ఆసుపత్రి ఇన్‌ఛార్జి డాక్టర్ నాగేశ్వర్‌రావు, డాక్టర్ శేఖర్, డాక్టర్ సుగుణ, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ అశ్వినిచంద్ర, డాక్టర్ బ్రహ్మేంద్ర, రాష్ట్ర సిహెచ్ఒ ప్రెసిడెంట్ పిల్లి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారాయి

**ఎపిఆర్‌డిసి డైరెక్టర్ గుల్జార్‌బాషా**

**రాజంపేట అర్బన్, జూన్ 12 ప్రభాతవార్త**



రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు నేడు కార్యక్రమం ద్వారా జరిగిన అభివృద్ధి పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయని రాష్ట్ర రహదారుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక ఉర్దూ హైస్కూల్లో జగనన్న విద్యాకానుకను ఉపాధ్యాయులతో కలిసి గుల్జార్‌బాషా, మున్సిపల్ వైస్ ఛైర్మన్ సుమయాబేగం, ప్రధానోపాధ్యాయులు రఘురాం, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఇనయతుల్లా తదితరులు పంపిణీ చేశారు. పాఠశాలను తెరిచిన రోజే విద్యార్థులకు అవసరమైన బ్యాగు, దుస్తులు ఇతర కానుకలను పంపిణీ చేసిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాజంపేట నియోజకవర్గంలో అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుకలు సక్రమంగా అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి గుల్జార్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూళనపై అవగాహన ర్యాలీ

**బద్వేలు, జూన్ 12 ప్రభాతవార్త :**



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమగ్రాభివృద్ధి శాఖ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూళన సామాజిక బాధ్యత అని కోరుతూ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుండి ఆర్టీసి బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపివో శ్రీదేవి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూళన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. బాల కార్మిక వ్యవస్థను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. పిల్లలందరినీ బడికి పంపించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు అన్ని శాఖల అధికారులు ఈ వ్యవస్థను నిర్మూళించడానికి కృషి చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ కొనసాగడం వలన సమాజంలో అనుచిత పరిస్థితులు జరుగుతాయన్నారు. పిల్లలందరినీ చదివించాలని, తమ పరిధిలో ఎక్కడైనా బాల కార్మిక వ్యవస్థ ఉంటే వెంటనే తమకు సమాచారం అందించాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా పోలీసులు, బాలల పరిరక్షణ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత

**బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : తహశిల్దారు శిరీషా**

**చిట్వేలి, జూన్ 12 ప్రభాతవార్త**



బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మనందరి బాధ్యత అని చిట్వేలి మండల తహశిల్దారు శిరీషా పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఓ రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో తహశిల్దారు శిరీషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తాను మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని అన్నారు. 16 సంవత్సరాల లోపు పిల్లలచే పనులు చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. అట్టివారిపై బాలకార్మిక నిషేద చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం ఐసిడి ఎస్ సిడిపిఓ రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతిఒక్కరు నేటిబాలలే రేపటి పౌరులు అన్న వాస్తవాన్ని గురించి చిన్నపిల్లలందరిని బడులకు పంపాలని, ప్రభుత్వం ఇస్తున్న వసతులను ఉపయోగించుకుని పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వడం తల్లి దండ్రుల బాధ్యత అన్నారు. హోటల్, మెకానిక్ షెడ్‌లు, ఇటుకుల తయారీ తదితర చోట్ల పిల్లలు పని చేస్తున్నారని ఇది చట్టరీత్యా నేరమని, యజమానులు ఇప్పటికైనా పిల్లలను పనిలో చేర్చుకోవడం మానాలని లేకుంటే చర్యలు తప్పవని అన్నారు. తదుపరి ప్లకార్డులను పట్టుకొని నినాదాలు, ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఓ మోహన్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ వసుంధర, జిఎంఎస్‌కె అమరావతి, స్వర్ణ, శారదా, శోభ, అంగన్వాడి కార్యకర్తలు సుధామణి, సుజాత, రాధాశ్యామల, శాంతికుమారి పాల్గొన్నారు.

## బడులు తెరిచిన తొలిరోజే విద్యాకానుక కిట్లు అందజేయడం విశేషం

**గాలివీడు, జూన్ 12 ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల వైస్ ఎంపిపి యదు భూషణ్ రెడ్డి హాజరై విద్యకానుక కిట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పిల్లల తల్లిదండ్రులకు విద్య భారం కాకూడదని వైయస్ జగన్మోహన్ రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాకి డబ్బులు వేస్తున్నారని అలాగే వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యా కానుక గోరుముద్ద లాంటి మంచి పథకాలను ప్రవేశపెట్టి విద్య కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. బడులు తెరిచిన తొలిరోజే అందజేత ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతుండడం విశేషం అన్నారు. ప్రతి విద్యార్థికీ దాదాపు 2,400 రూపాయల విలువైన జగనన్న విద్యా కానుక అందనుంది. పాఠశాలలు తెరిచిన రోజే మొత్తం 10 వస్తువులతో కూడిన కిట్‌ను విద్యార్థులు అందుకోవడం చరిత్రననేన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోంది ఏపీ సర్కారు. విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లు గా తీర్చిదిద్దేలా చర్యలు చేపడుతుండడంతో రాబోయే రోజుల్లో ప్రతి బడి ఇంగ్లీషు మీడియంతో సీబీఎస్ఈ సిలబస్ తీసుకొస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పిఎంసీ చైర్మన్ రజిత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, వైసిపి నాయుకులు నిజాముద్దీన్, గోపి రెడ్డి, పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పాల ఏకరి కులానికి ప్రభుత్వం చేసిందేమిలేదు

**అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు గురిగింజకుంట భాస్కర్‌నాయుడు**

**రామాపురం, జూన్ 12 ప్రభాతవార్త**



పాలఏకరి కులాలకు జగన్ ప్రభుత్వం ఆర్భాటాలు తప్ప చేసింది ఏం లేదని అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులు గురిగింజకుంట భాస్కర్ నాయుడు అన్నారు. సోమవారం రామాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పాలయకరి కులాలను ప్రభుత్వం గుర్తించలేదని వారికి అన్ని రంగాల్లో అవకాశం కల్పించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 లక్షల జనాభా కలిగి ఉన్నారన్నారు. ఈ రాష్ట్రంలో పాల ఎకరి కార్పొరేషన్ చైర్మన్ అదేవిధంగా 12 మంది డైరెక్టర్లు నియమించారని రెండు సంవత్సరాలుగా కావస్తున్న ఏ పేదవానికి కూడా న్యాయం జరగలేదన్నారు. రాష్ట్రంలో తమ కులానికి చెందిన చదువుకున్న యువతీ యువకులు నిరుద్యోగులుగా ఉన్నారే తప్ప వారికి ప్రభుత్వం చేసింది ఏం లేదన్నారు. చదువుకున్న యువతీ యువకులు కార్పొరేషన్ వచ్చింది మాకేదో మేలు జరుగుతుంది. చాలా సంతోషపడ్డారు కానీ ఆ సంతోషం కొద్ది రోజుల్లో నిరాశపరిచిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ కులాలకు సంబంధించిన 55 కార్పొరేషనలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తమ కులానికి చెందిన కార్పొరేషన్ ఒకటి కార్పొరేషన్లు రెన్యువల్ ప్రభుత్వం చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ కులానికి సంబంధించిన కార్పొరేషన్ ను రెన్యువల్ చేయాలని ఆయన అన్నారు.అధికార పార్టీ నాయకులు తమ కులాన్ని కించపరిచే విధంగా కొందరు నాయకులు మాట్లాడుతూ మాట్లాడడం సరికాదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న తమ కులానికి మేలు జరగలేదన్నారు. ఈనెల 29న అన్నమయ్య జిల్లా రాయచోటి యందు పాలయకిరి రాష్ట్ర అధ్యక్షుని ఎన్నిక జరుగుతుందన్నారు . రాష్ట్రంలోనే అన్ని జిల్లాల పాల ఏకరీ అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

